క్లుప్తంగా

జాతీయ స్థాయికి ఎంపిక


కనకపుడి అఖిల

వైరారూరల్: హనుమకొండలోని చైతన్య యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ పీజీ చివరి సంవత్సరం చదువుతున్న వైరా మండలం నారపునేనికి చెందిన కనకపుడి అఖిల జాతీయ స్థాయి యువజనోత్సవాలకు ఎంపికైంది. మహారాష్ట్రలోని నాసిక్‌లో యువజనోత్సవాలు శుక్రవారం ప్రారంభం కాగా ఆమె జిల్లా బృందంతో కలిసి అక్కడకు వెళ్లింది.

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీకి ఎంపిక


మహేశ్వరి

ముదిగొండ: రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు మేడేపల్లి విద్యార్థిని ఎంపికైంది. మండలంలోని మేడేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ 8వ తరగతి చదువుతున్న ఏ.మహేశ్వరి ఇటీవల జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చగా రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. జనగామలో ఈనెల 16నుంచి జరిగే టోర్నమెంట్‌లో మహేశ్వరి పాల్గొంటుందని పీఈటీ బియ్యని కృష్ణయ్య తెలిపారు. ఆమెను ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సర్పంచ్ రమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ సమత, ఉపాధ్యాయులు అభినందించారు.

భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో నాయకులు

ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నాయకులు దేవరకొండ రాజీవ్‌గాంధీ, సగ్గుర్తి వెంకటనారాయణ, పాపట్ల వినయ్ కలిశారు. పలు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరాగా.. ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

తల్లాడ: మండలంలోని అంజనాపురం కోదండ రామాలయం వద్ద శుక్రవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎనిమిది మంది మాలధారులకు అర్చకులు తనుగుల మణికంఠ శర్మ ఇరుముడి కట్టగా.. మాలధారులు శబరిమలైకు బయలు దేరారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

తల్లాడ: తల్లాడకు చెందిన తడికమళ్ల మణి సరస్వతి(13) గత కొంత కాలంగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న 'జాంబవ వారసులం'గ్రూపు సభ్యులు రూ.30 వేలు వితరణ చేసిన నగదును శుక్రవారం బాధితురాలికి తల్లాడ ఎస్సై పి.సురేష్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్సై బంక యాకూబ్, గొల్లమందల విజయ్, వేల్పుల నరేష్, కొమ్ము సుధాకర్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఇనుపనూరి ప్రదీప్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

బోనకల్: ద్విచక్రవాహనం ఢీకొన్న వృద్ధుడికి గాయాలయ్యాయి. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కట్టా భాస్కర్ కిరాణ సరుకుల నిమిత్తం రావినూతల బయలుదేరాడు. ఈక్రమాన బోనకల్ వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో భాస్కర్ తలకు తీవ్ర గాయమైంది. దీంతో 108లో ఖమ్మం తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

తల్లాడ: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. శుక్రవారం మండలంలోని మల్లవరం గ్రామ సమీపంలోని పొలాల్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్సై సురేష్ సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారివద్ద నుంచి రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా కూడారై ఉత్సవం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలో గల శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో కూడారై ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి 108 గంగాళాలతో పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. తిరుప్పావై ధనుర్మాస ప్రవచనాన్ని అర్చకులు చైతన్య వివరించారు. విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పతంగుల సందడి..

- కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిట
- చిన్నారులకు నచ్చేలా రంగురంగుల గాలిపటాలు
- అప్రమత్తత అవసరం


పతంగుల దుకాణం వద్ద చిన్నారుల సందడి

సత్తుపల్లిటౌన్: పదపదవే గాలిపటమా అంటూ చిన్నారులు సందడి చేస్తున్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే పిల్లల ఆనందానికి హద్దులుండవు. గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందంగా గడిపేస్తున్నారు. రంగురంగుల గాలిపటాలను ఆకాశంలోకి పిల్లలు ఎగురవేస్తుంటే.. పిల్లలకే కాదు పెద్దల మనస్సులను రంజింప చేస్తాయి.

వాడవాడలా సంబురాలు..

విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించటంతో వాడవాడలా విద్యార్థులు పతంగుల సంబురాల్లో నిమగ్నమయ్యారు. అపార్ట్‌మెంట్లు, డాబాలు, ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాల సందడి జోరుగా సాగుతుంది. వివిధ రంగులు, ఆకృతుల్లో తయారు చేసిన పతంగులు దుకాణాల వద్ద దర్శనమిస్తున్నాయి. చిన్నారుల కోసం బాహుబలి, డోరిమాన్, చోటాబీన్ వంటి పతంగులు ఉన్నాయి. పిల్లలు ఇష్టపడే కార్టున్‌ల లో పతంగులు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. కొందరు చిన్నారులు సాంప్రదాయంగా ఇంట్లోనే కాగితాలతో స్వయంగా గాలిపటాలను తయారు చేసుకొని ఎగురవేస్తున్నారు. దారంబంతిని చేతబూని వీధిలో గాలిపటాలను ఎగురుతున్నంతసేపు ఆ ఆనందాన్ని.. అనుభూతిని పంచుకుంటూ పోటాపోటీగా ఎగురవేస్తూ సంబురపడుతున్నారు. అయితే ఇలా గాలిపటాలు ఎగురవేసేటప్పుడు పిల్లలు జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- మాంజాను ఎక్కువగా వాడకూడదు. దీంతో చేతులు కోసుకునే ప్రమాదం ఉంది.
- విద్యుత్‌తీగలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించకూడదు.
- బహిరంగ ప్రదేశాల్లోనే గాలిపటాలను ఎగరేయాలి.
- తెగిన గాలిపటాలను అందుకునేందుకు రోడ్లపై అడ్డంగా పరుగెత్తకుండా.. రోడ్డుపై వస్తున్న వాహనాలను గమనించాలి.
- భవనాలపై పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
- ఆకాశంలో పతంగి ఎగురుతున్నప్పుడు నేలపై పరుగులు తీయొద్దు..
- ఎత్తైన చెట్లపై పడితే పిల్లలను అటువైపు వెళ్లనీయవద్దు. దారం తెంచి వదిలేయాలి.


మైదానంలో పతంగులు ఎగురవేస్తున్న దృశ్యం

చాలా మోడల్స్ ఉన్నాయి..



ఈ సంవత్సరం మార్కెట్లో చాలా మోడల్స్ గాలిపటాలు వచ్చాయి. వీటిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మా వీధిలోని పిల్లలందరం కలిసి మైదానంలో గాలిపటాలు ఎగురవేస్తాం. గాలిపటం ఎంత ఎత్తుకు ఎగిరితే అంత సంబురపడతాం.

– ఎం.గౌతమి, సత్తుపల్లి

పండుగ వచ్చిందంటే..



సంక్రాంతి పండుగ రావటానికి పదిరోజుల ముందు నుంచే గాలిపటాలను ఎగురవేస్తాం. ఫ్రెండ్స్ గాలిపటాల కంటే నా గాలిపటం ఎక్కువ ఎత్తుకు పోతుంటే చాలా ఆనందంగా ఉంటుంది. ఒకరికంటే ఒకరం పోటీపడి గాలిపటాలు ఎగురవేస్తున్నాం.

– దూదిపాల తతస్, సత్తుపల్లి

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరాలోని రైతు వేదిక భవనంలో కొణిజర్ల, వైరా మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను ప్రభుత్వం ఆదుకుంటుందని, అర్హులందరికీ కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లోటులో ఉన్నా ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, వైరా ఎంపీపీ వేల్పుల పావని, కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, ఏదునూరి సీతారాములు, పణితి సైదులు, నరసింహారావు, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలి

ముదిగొండ: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా జాతీయ ఉపాధ్యక్షుడు లంక వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ముదిగొండలో శుక్రవారం అధ్యక్షుడు కొత్తపల్లి నరసింహ అధ్యక్షతన నిర్వహించిన మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీలోనైనా ఎస్సీ వర్గీకరణ తీర్మానం చేయాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు కుర్రి నరసింహారావు, ఉపేందర్, ఇరుకు కృష్ణ, గురుస్వామి, ధర్మ, సంగయ్య, బాలయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న అధికారులు

మధిర: మధిర పట్టణంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఎండోమెంట్ అధికారులు కానుకల హుండీ లెక్కించారు. హుండీ ఆదాయం రూ.43,920 వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, రీజినల్ కోఆర్డినేటర్ రామకోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి హరి రవి శాస్త్రి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ


భవ్యశ్రీకి ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రాచమళ్ల రవికుమార్ – నాగమణి దంపతుల కుమార్తె భవ్యశ్రీ ఫ్యాషన్ డిజైనింగ్ మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ విభాగంలో 62వ ర్యాంక్‌తో జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సీటు సాధించింది. ఉన్నత విద్య కోసం ల్యాప్‌టాప్ అందించాలని ఎంపీ బండి పార్థసారధిరెడ్డిని కోరగా.. శుక్రవారం సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తన క్యాంప్ కార్యాలయంలో విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందించారు. ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, యాగంటి శ్రీనివాసరావు, దొడ్డా శంకర్‌రావు, మల్లూరు అంకమరాజు, గోగులమూడి బాలాజీరెడ్డి, పర్వతనేని వేణు, కొప్పుల అవినాష్, గరిడేపల్లి వెంకి పాల్గొన్నారు.

పరామర్శ..


తల్లాడ/కల్లూరురూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మిట్టపల్లి ఎంపీటీసీ కోరం కనకయ్యను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా కల్లూరుమండలంలోని చంద్రుపట్లలో కాటంనేని వెంకటనర్సయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న డి.కోటయ్యను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వైరా ఎఎంసీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, సర్పంచ్ శ్రీనివాసరావు, లక్ష్మణ్‌రావు, నాయుడు శ్రీను, కొండపల్లి శేఖర్‌బాబు, నాగంటి నాగులు, చల్లా వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరావు, సర్పంచ్ ప్రసాద్, కిషోర్, కృష్ణ, రజనీకాంత్, కిరణ్, రవి, విశ్వనాదం, వైస్ సర్పంచ్ రామారావు, రాధాకృష్ణ, నారాయణరావు, వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు అందరికీ చేరాలి


సత్తుపల్లిరూరల్: బేతుపల్లిలో క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తల్లాడ/సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ చేరాలని బీజేపీ మండల అధ్యక్షులు వెంకటరామారావు, శ్రీనివాసరావు తెలిపారు. తల్లాడ మండలంలోని కొత్త వెంకటగిరి, రామచంద్రాపురం గ్రామాల్లో, సత్తుపల్లిలోని బేతుపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శుక్రవారం నిర్వహించారు. అనంతరం బీజేపీ పథకాలకు సంబంధించిన క్యాలెండర్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్రపథకాలు అందాలనే లక్ష్యంతో పీఎం మోదీ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ మేనేజర్ శివ సతీష్, డాక్టర్ నీలిమ, దిరిశాల నరేష్, చాపల కోటేశ్వర్‌రావు, సునావత్ కవిత, శీలం తిరుపతిరెడ్డి, నాగుల్‌మీరా, కేవీకే శాస్త్రవేత్త శ్రీలత, నాగరాజు, సర్పంచ్ పాకలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి రవితేజ, అంగన్‌వాడీ, మెడికల్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి


ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

చింతకాని: గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలతో పాటు సమ్మె కాలపు వేతనాలను కూడా వెంటనే మంజూరు చేయాలని ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని, కార్మికులను క్రమబద్దీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామదాసు, జిల్లా నాయకులు ఆవుల అశోక్, శంకర్, నానయ్య, ఫణిరాజు, సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి

సత్తుపల్లిటౌన్/కొణిజర్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు కోసం పట్టభద్రులు ఫిబ్రవరి 6వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలని కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, కొణిజర్ల తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్ తెలిపారు. సత్తుపల్లిలోని రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు ఆన్‌లైన్ విధానంతో పాటు మ్యాన్యువల్‌గా ఫాం–18 దరఖాస్తులను అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టభద్రుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఎన్నికల గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు ఫొటోలను జత చేయాలని తెలిపారు. 2020 నవంబర్ 1వ తేదీలోపు డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. గతంలో ఓటు హక్కు ఉన్న వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ తహసీల్దార్లు యోగీశ్వరర్‌రావు, రాజు, ప్రతాప్, రవికుమార్, సాంబశివుడు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కోలాహలంగా సంక్రాంతి క్రీడా పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ చందర్

బోనకల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆళ్లపాడులో అమ్మ ఫౌండేషన్ ఆళ్లపాడు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10 మండలాల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ పొన్నం చందర్ శుక్రవారం ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకుడు కందుల పాపారావు, ఎంపీటీసీ సభ్యురాలు పారా శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పారా వెంకటమోహనరావు, బుంగా రాములు, లింగయ్య, వెంకటేశ్వరరావు, నరేష్, రవి, వెంకట్రావు, నాగభూషణం, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు..

ఏన్కూరు: మండలంలోని భగవాన్‌నాయక్ తండలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు మండలాల వాలీబాల్ పోటీలను శుక్రవారం ఎస్సై బాదావత్ రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాపోటీల్లో గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో క్రీడలు ఆడాలని కోరారు.

నారాయణపురంలో ముగ్గులు..

తల్లాడ: మండలంలోని నారాయణపురం రామాలయం వద్ద లయన్స్‌క్లబ్, విప్రో సంతూర్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించగా.. పరిసర గ్రామాల నుంచి మహిళలు పాల్గొన్నారు. రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, అనుమోలు సర్వేశ్వర్‌రావు, నంభూరి కనకదుర్గాప్రసాద్, కర్నాటి లక్ష్మారెడ్డి, శీలం సత్యనారాయణరెడ్డి, పాట్టేటి బ్రహ్మారెడ్డి, ఐనాల రామలింగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట

విద్యాలయాల్లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలలు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తుందని పలువురు నాయకులు, ఉపాధ్యాయులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సంక్రాంతి సంప్రదాయం కళ్లకు కట్టినట్టు వేషధారణలతో, ఆట పాటలతో విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థినుల రంగవల్లులు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. ఉపాధ్యాయులు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరా న్యూలిటిల్‌ఫ్లవర్స్ పాఠశాలలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్


సత్తుపల్లిలోని కేపీఆర్ పాఠశాలలో..


ఎర్రుపాలెం: బనిగండ్లపాడు పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు


కొణిజర్ల: విజయ ఇంజనీరింగ్ కళాశాలలో..


ఏన్కూరులో..

యువతకు వివేకానందుడు స్ఫూర్తి

ఘనంగా వివేకానంద జయంతి


మధిర: వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏడీఈ అనురాధ

మధిర: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఏడీఈ ఎం.అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం మధిర విద్యుత్‌శాఖ సబ్ డివిజన్‌కార్యాలయంలో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఈలు కె.నాగేశ్వరరావు, ఎస్ అనీల్ కుమార్, లావణ్య, సిబ్బంది శ్రీధర్, నరేష్, సత్యనారాయణ, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

వైరా: వైరాలోని వాణీ వివేకానంద విద్యాలయంలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పాఠశాల కరస్పాడెంట్ చుండూరి కోటేశ్వరరావు, హెచ్‌ఎం వాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవ వేడుకలు, సృజనాసాహితీ సమాఖ్య ఆవిర్భావ వేడుకలను శుక్రవారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద జీవిత చరిత్రపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. భగవద్గీత పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో రవాణాశాఖాధికారి ఎస్.వెంకటపుల్లయ్య, జి.రామకృష్ణ, బి.మధుసూదన్‌రాజు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సత్తుపల్లి: బహుమతులు అందజేస్తున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. వివేకానందుడి జయంతిని నిర్వహించగా.. కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండలంలోని గ్రంథాలయ ఆవరణలో కిండ్లీ రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతి నిర్వహించగా.. ఆయన చిత్రపటానికి సంస్థ అధ్యక్షురాలు వి.అనూష నివాళి అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఓవో మంజూర్ అహ్మద్, అధ్యాపకులు జి.రామారావు, కిండ్లీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సత్యనారాయణ, నాగరాజు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి గ్రామంలో వివేకనంద వికాస వేదిక ఆధ్వర్యంలో.. వివేకానంద విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. అనంతరం బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యనభ్యసిస్తున్న షేక్.చాందిని, హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న వేల్పుల భాగ్యలక్ష్మిలకు ప్రవాస భారతీయుడు కొండబాల సురేష్ సహకారంతో ఒక్కొక్కరికీ రూ.5 వేల నగదు ప్రోత్సహకాన్ని అందించారు. కార్యక్రమంలో వివేకనంద వికాస వేదిక అధ్యక్షుడు జేవీ సూర్యప్రకాష్, వైరా దాసాంజనేయ ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎర్రుపాలెం: వివేకానందుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు


కారేపల్లిలో..

ఏన్కూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో.. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్, నారాయణ, దర్గయ్య, కృష్ణప్రసాదు, రామారావు పాల్గొన్నారు.

కారేపల్లి: స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా.. కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ యువజనోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కారేపల్లి ప్రభుత్వ కళాశాల నుంచి సినిమాహాల్ సెంటర్ వరకు ర్యాలీగా ప్రదర్శన నిర్వహించి.. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాచలం, గ్రామపెద్దలు నారాయణ, వెంకటేశ్వర్లు, రంగనాథ్, అధ్యాపకులు మోహన్, జయప్రకాశ్, మల్లిక, దుర్గాప్రసాద్, వనిత, పార్థసారధి, రమ, లక్ష్మీనారాయణ, యాకయ్య, రాంబాబు, ఖాసీం, బాబురావు, కవిత, కృష్ణవేణి, పాషా, సుధీర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.